సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



రాజవొమ్మంగిలో భారీ వర్షం

రాజవొమ్మంగి మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. 26.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. 8లో



జగనన్న భూహక్కు రైతులకు వరం

జగనన్న భూ హక్కు పథకం గిరి రైతులక వరమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. 8లో



పిడుగుపాటుకు మహిళ మృతి

కూనవరం మండలంలో పిడుగుపాటుకు గిరిజన మహిళ మృతి చెందగా మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. 8లో

న్యూస్‌రీల్

నేడు స్వచ్ఛత హై సేవ

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆదివారం స్వచ్ఛత హై సేవ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలోను స్వచ్ఛత కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గ్రామాలలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని వర్గాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రశాంతంగా రాత పరీక్ష



గురుకుల కళాశాల సెంటర్‌లో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

సాక్షి,పాడేరు: నీతి అయోగ్ యాస్పిరేషన్ ఫెలో రాత పరీక్ష శనివారం స్థానిక గురుకుల కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని మూడు పోస్టులకు సంబంధించి 505 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 398మంది రాతపరీక్షకు హాజరయ్యారని పర్యవేక్షకుడు సీపీవో ఎస్.ఆర్.కె.పట్నాయక్ తెలిపారు. రాత పరీక్ష ద్వారా ఇంటర్వ్యూకు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను కొద్ది రోజుల్లో జిల్లా వెబ్‌సైట్‌తో పాటు కలెక్టరేట్ అందుబాటులో ఉంచి, అభ్యర్థులకు సమాచారమిస్తామన్నారు,

కళాకారుల గుర్తింపు కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని కళాకారులకు గుర్తింపుకార్డులు జారీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీపీఆర్వో పి.గోవిందరాజులు తెలిపారు. అభ్యర్థులు (కళాకారులు) తండ్రిపేరు, పుట్టినతేది, పూర్తి చిరునామా, కళారూపం, అనుభవం, కళాకారులుగా పొందిన ధ్రువపత్రాలు, ఫోన్, ఆధార్ నంబర్, ఈమెయిల్ అడ్రస్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఽపూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల ఏడవ తేదీలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.



రంపచోడవరంలో వైద్య శిబిరంలో వివరాలను తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



రంపచోడవరంలో జగనన్న సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



అరకులోయలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అరడకోటలో రోగిని పరీక్షిస్తున్న జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు

చెంతకే వైద్యం..గిరిలో ఆనందం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గిరిజనుల ముంగిటకు వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో వారిలో ఆనందం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 11 చోట్ల నిర్వహించిన వైద్య శిబిరాల్లో 3464 మందికి వైద్య సేవలు అందించారు. 270 మందిని ఉన్నత వైద్యానికి రిఫర్ చేసినట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారవర్గాలు తెలిపాయి.

- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన
- జిల్లా వ్యాప్తంగా 3464 మందికి వైద్యపరీక్షలు
- ఉన్నత వైద్యానికి 270 మంది రిఫర్

సాక్షి,పాడేరు: జిల్లాలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు విజయవంతమయ్యాయని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. శనివారం నిర్వహించిన శిబిరాల్లో డుంబ్రిగుడలో 588మంది,పెదబయలు మండలం అరడకోటలో 522, అరకులోయలో 354, జి.కే.వీధి మండలం మొండిగూడలో 375, మారేడుమిల్లి మండలం తాడేపల్లిలో 313,దేవీపట్నం మండలం ఇందుకూరులో 232, వై.రామవరం మండలం పి.యర్రగొండలో 162, గంగవరం మండలంలోని మోహనపురంలో 292, రంపచోడవరం మండలం పెదగడ్డాడలో 167, ఎటపాక మండలం చోడవరంలో 303 మంది రోగులకు వైద్యపరీక్షలు జరిపామని తెలిపారు.

అరకు (సాక్షి,పాడేరు): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా అన్నివర్గాల ప్రజలకు గ్రామ స్థాయిలో ఉన్నత వైద్యసేవలు కల్పిస్తున్నామని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రోగులు పొందుతున్న సేవలు మందుల పంపిణీని పరిశీలించారు. ఎమ్మెల్యే పాల్గుణ కంటి పరీక్షలు చేయించుకుని గిరిజనులను చైతన్యపరిచారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో అరడకోట,డుంబ్రిగుడ,అరకులోయలో తొలిరోజు మూడు వైద్యశిబిరాలను వైద్యనిపుణులతో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, తహసీల్దార్ వేణుగోపాల్, అరకు, డుంబ్రిగుడ ఎంపీపీలు రంజపల్లి ఉషారాణి, బాకా ఈశ్వరి, డుంబ్రిగుడ జెడ్పీటీసీ చటారి జానకమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, గన్నెల పీహెచ్‌సీ వైద్యాధికారి యాంజిల్ సుసాన్, ఎంఈవో భారతీరత్నం,సీడీపీవో శారద పాల్గొన్నారు.

రంపచోడవరం: పేదలందరికీ సకాలంలో వైద్యసేవలందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని రంపచోడవరం ఐటీడీఏ పీవో పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏజెన్సీలోని ఏడు మండలాల్లో 76 ప్రత్యేక వైద్య శిబిరాలు నిపుణులతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైద్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి కార్యక్రమ ఉద్దేశంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం: ఎమ్మెల్యే ధనలక్ష్మి

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు.శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. అధిక సంఖ్యలో వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, తహసీల్దార్ పీవీవీ జయకుమార్, ఎంపీడీవో హరికృష్ణ, ఈఎన్‌టీ వైద్య నిపుణులు టీవీ క్రాంతి కిరణ్ శ్వాసకోశ వైద్య నిపుణులు కల్పన వైద్యులు ముకేంద్ర, కెల్విన్, వినోద్, ఎంపీహెచ్‌వోలు పీటర్, మూర్తి, ఈవోపీఆర్డీ జాన్ విల్సన్, రంపచోడవరం సర్పంచ్ మంగ బుజ్జియ్య, పంచాయతీ కార్యదర్శి సుధా ప్రకాష్ పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామ సచివాలయం వద్ద చవిటిదిబ్బలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 450 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అధిక సంఖ్యలో వైద్య సేవలు పొందినట్టు డాక్టర్ నరేంద్రకుమార్ తెలిపారు.



గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన గిరిజనులు

పెదబయలు: స్థానిక పీహెచ్‌సీ పరిధి అరడకోట వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లినిక్ పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి భారీ ఎత్తున రోగులు వచ్చారు. శిబిరాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ ఎముకలు,ఈఎన్‌టీ, ఇతర వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు పరీక్షించి రోగులకు ఉచితంగా మందులు అందించినట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ 522 మంది చేసుకోగా 89 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం విశాఖలోని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. 15 రోజుల నుంచి నిర్వహించిన సర్వే ఆధారంగా వైద్య శిబిరంలో సాయంత్రం 4.30 గంటల వరకు సేవలందించారు. ఎంపీడీవో పూర్ణయ్య, జనరల్ సర్జన్ డాక్టర్ సర్వేశ్వరరావు, ఆర్థోపెడిక్ డా.రవి, ఈఎన్‌టీ డా.నవీన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎం.చంద్రశేఖర్, వైద్యులు నిఖిల్, సింధూరం పడాల్, వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు.ఎంఈవోలు కృష్ణమూర్తి, పుష్ప, సర్పంచ్‌లు మత్యలింగం,కొర్ర కాసులమ్మ, మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం, పీఏసీఎస్ చైర్మన్ వెంకయ్య పాల్గొన్నారు.

చోడవరంలో ..

ఎటపాక: మండలంలోని నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చోడవరంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఎక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేసుకొని సేవలు పొందారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పొడియం మణి, వైద్యులు కోటిరెడ్డి, ప్రత్యూష్, దేవినాగు, విష్ణుప్రియ, గౌతమి, పీహెచ్ఎన్ అరుంధతి సేవలందించారు. మాజీ ఎంపీటీసీ ఎలమోలు రమేష్, కృష్ణబాబు, నాగేశ్వరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొండిగెడ్డలో..

గూడెంకొత్తవీధి: మండలంలోని మొండిగెడ్డ సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. 474 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నా అంతకుమించి సేవలు పొందారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులకువ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. పోషక విలువలు గల ఆహారం తీసుకోవడంపై ప్రయోజనాలు సీడీపీవో లక్ష్మీదేవి అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్య నిపుణులు సాయికృష్ణ, సుధాశారద, కోమలి హరిరామ్ కిషోర్, మొండిగెడ్డ సర్పంచ్ ప్రియాంక, ఎంపీటీసీ విజయలక్ష్మి, ఈవోపీర్డీ పాపారావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

సత్వరం వైద్యసేవలు



జగనన్న సురక్ష వైద్య శిబిరంలో సత్వరం వైద్యసేవలు అందుతున్నాయి. ప్రాథమికంగా పరీక్షించి మందులు అందజేస్తున్నారు. సమీపంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరం ఎంతో ఉపయుక్తంగా ఉంది.

– కొర్రా ముల్లె, గిరిజన మహిళ

అవగాహన కల్పించారు



ఇంటి వద్దకు వైద్య సిబ్బంది వచ్చి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఎటువంటి వ్యాధుల కైనా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా వైద్యం అందంచడం వల్ల పేదలకు ఎంతో మేలు.

– శ్రావణి, అంత్రిగుడ

ఇంటివద్దకే వైద్యం బాగుంది

ప్రభుత్వం ఇంటి వద్దకే వైద్యం అందుబాటులోకి తేవడం ఎంతో ఉపయోగకరం. ఇప్పటివరకు మండలం, డివిజన్, జిల్లా ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. సర్వే చేసేందుకు ఇంటింటికి వచ్చిన సిబ్బంది ఆరోగ్య సమాచారం తెలుసుకన్నారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

– సీకరి లచ్చుమ్మ, వృద్ధురాలు, అరడికోట

చేసిన అభివృద్ధి చెప్పండి



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు కె.భాగ్యలక్ష్మి, ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ రవిబాబు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- అల్లూరి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

సాక్షి, విశాఖపట్నం: నాలుగున్నరేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడమే కాకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఎండాడ లా కాలేజీ సమీపంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఏ మార్గాన్ని అనుసరించాలి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు ఎలా చేరువేయాలి..అనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైవీ సుబ్బారెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకం విజయవంతం కావడం ...రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు వెనువెంటనే ప్రభుత్వం అందించిందన్నారు. అదేతరహాలో ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజల చెంతకే వైద్యసేవలందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల వద్దకే వెళ్లి సచివాలయాల పరిధిలో నిపుణులతో వైద్య శిబిరాల నిర్వహించి ఉచితంగా పరీక్షలు, మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో గుర్తించిన 1.60 లక్షల కుటుంబాలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. రోగులను వైద్య శిబిరాలు వద్దకు తీసుకువచ్చే బాధ్యత గృహసారథులు, వలంటీర్లదేనని ఆయన వివరించారు. రోగులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా వైద్య పరీక్షలు చేయించుకుని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

ఎందుకు జగనన్నే కావాలి..

ఇదిలా ఉండగా ''ఎందుకు ఆంధ్రాకు జగనన్నే కావాలి'' అనే వినూత్న కార్యక్రమాన్ని కూడా వార్డుల్లో, గ్రామాల్లో నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అనుబంధ సంఘాల ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ప్రతీ గ్రామానికి వెళ్లి అక్కడ పార్టీ జెండా ఆవిష్కరించాలని ఆయన సూచించారు. వెళ్లిన ప్రతి గ్రామంలోనూ లబ్ధిపొందిన ప్రతి ఇంటిపై పార్టీ జెండా ఎగరాలన్నారు. రాత్రికి అదే గ్రామంలో బసచేసి, అక్కడే భోజనాలు చేసి గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా చంద్రబాబు తన హయాంలో ప్రజలను ఏ విధంగా మోసం చేశాడో కూడా ప్రజలకు చెబుతూ ''అపు బాబు నాటకం...జగనే మా నమ్మకం'' అంటూ నినదించి రావాలని సుబ్బారెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, మాజీ మంత్రి బాలరాజు, నియోజకవర్గ పరిశీలకులు, జిల్లా పార్టీ కారవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు, పార్టీ నియోజవర్గ పరిశీలకులు హాజరయ్యారు.

కాఫీ రైతుకు పండుగొచ్చింది

మన్యంలో కాఫీ పంట పక్వదశకు చేరుకుంటోంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పూత ముందుగానే వచ్చింది. వర్షాలు కాఫీ తోటలకు అనుకూలించాయి. కాఫీ కాయలు, పండ్లతో కళకళలాడుతున్నాయి. గతేడాది మాదిరిగానే మార్కెట్ పరిస్థితులు కలిసొస్తే ఈ ఏడాది రైతులకు లాభాలు పొందే పరిస్థితులున్నాయి.

- పక్వదశకు చేరుకుంటున్న ఫలసాయం
- కళకళలాడుతున్న తోటలు
- గిరి రైతుల్లో ఆనందం



హుకుంపేట మండలం బర్మన్‌గుడ ప్రాంతంలో పక్వానికి వస్తున్న కాఫీ పండ్లు

సాక్షి, పాడేరు: మన్యంలో కాఫీ సాగు ఈ ఏడాది రైతులకు సిరులు కురిపించనుంది. సేంద్రియ విధానంలో పండించడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో కాఫీతోటలు ఫలసాయంతో నిండుగా కనిపిస్తున్నాయి. మే నెల తరువాత రావాల్సిన పూత మార్చిలో ముందుగానే వచ్చింది. ప్రస్తుతం పిందె దశలో ఉండాల్సిన తోటలు ప్రస్తుతం పక్వదశకు చేరుకున్నాయి. అక్కడక్కడ పండ్లు కనిపిస్తుండటంతో గిరి రైతుల్లో ఆనందం నెలకొంది. ముందుగానే కాఫీ పండ్ల సేకరణ పనులు కూడా ప్రారంభమయ్యే అవకాశం ఉందని కాఫీ బోర్డు అధికారులు పేర్కొంటున్నారు.

పెరగనున్న కాఫీ దిగుబడి : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో 2.20 లక్షల ఎకరాల్లో పాడేరు డివిజన్‌లోని 11 మండలాల గిరిజన రైతులు కాఫీ తోటలు సాగు చేస్తున్నారు. వీటిలో 1.56 లక్షల ఎకరాలు ఫలసాయం ఇస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. గతేడాది 1.50 లక్షల ఎకరాల్లో 75వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను రైతులు సేకరించారు. వీటి ద్వారా 16 వేల టన్నుల పార్చ్‌మెంట్, క్లీన్ కాఫీ గింజలను రైతులు ఉత్పత్తి చేశారు. అయితే ఈఏడాది మరో 6వేల ఎకరాల్లో తోటలు కాపునకు వచ్చే అవకాశం ఉందని కాఫీ బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. దీని వల్ల రెండు వేల మెట్రిక్ టన్నుల అదనంగా దిగుబడి రావొచ్చని వారు పేర్కొంటున్నారు.

రికార్డు ధరతో మంచి ఆదాయం : ఈఏడాది జనవరి నుంచి మే వరకు జరిగిన కాఫీ మార్కెటింగ్‌లో గిరిజన రైతులు మంచి లాభాలు పొందారు.గిరిజన సహకార సంస్థ కిలో కాఫీ గింజలను రూ.280 నుంచి రూ.300కు కొనుగోలు చేసింది.అలాగే గిరిజన రైతులు పండ్ల దశలోనే కిలో రూ.40నుంచి 60తో పలు సంస్థలకు విక్రయించారు. పండ్ల అమ్మకాలతోను కాఫీ రైతులు లాభాలు పొందారు. అంటే ఎకరాకు రూ.45 నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వచ్చింది.

కాఫీ రైతులకు మంచి రోజులు



ఏప్రిల్, మే నెలలో కురిసిన భారీ వర్షాలకు కాఫీ తోటలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అదే సమయంలో ఎండలు తీవ్రత లేకపోవడంతో కాఫీతోటలకు చల్లదనం అనుకూలించింది. పూత ముందుగా వచ్చింది. అదేవిధంగా ఫలసాయం పక్వానికి చేరుకుంటోంది. మార్కెట్ పరిస్థితులు కలిసొస్తాయి.

– అశోక్, ఐటీడీఏ కాఫీ ఏడీ, పాడేరు

పిడుగుపాటుకు మహిళ మృతి

మరో ఇద్దరికి అస్వస్థత

కూనవరం: పిడుగుపాటుకు గిరిజన మహిళ మృతి చెందగా మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు.

మండలంలోని కాచవరం సమీప పొలాల్లో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నరసింగపేట గ్రామానికి చెందిన మహిళలు సోయం రత్తమ్మ(44), దానే నాగమ్మ, సత్తెమ్మ కాచవరం గ్రామానికి చెందిన రైతుకు పొలంలోకి కూలి పనికి వెళ్లారు. సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం పడుతుండగా తిరిగి వస్తున్న క్రమంలో పిడుగుపాటు గురయ్యారు. వీరిలో రత్తమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా కోలుకున్నారు. రత్తమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

రోల్‌మోడల్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు



వీడియో జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్ప సప్తాహ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, శిశు సంక్షేమ శాఖ పీవో సూర్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్చువల్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. వారు మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని, కేంద్రం సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రధాని మోదీ తెలియజేశారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని సక్రమంగా అందజేయాలన్నారు. కేంద్రాల నిర్వహణకు దాత సాయం తీసుకోవాలని సూచించారు. ఏపీవో జనరల్ శ్రీనివాసరావు, నీతి అయోగ్ అధికారి పెదబాబు, సీడీపీవోలు ప్రసన్న లక్ష్మీ, లక్ష్మీ, సంధ్యారాణి, ఈపీడీసీఎల్ ఈఈ యూసఫ్, ఎంపీడీవో జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పర్యటనలో ప్రజాప్రతినిధులు

గంగవరం/వై.రామవరం: దేశ రాజధాని ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నీతి ఆయోగ్ శనివారం నిర్వహించిన సంకల్ప్ కార్యాక్రమానికి గంగవరం, వై.రామవరం గంగవరం, వై.రామవరం మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గంగవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసులు నేతృత్వంలో రెండు మండలాలకు చెందిన ఎంపీపీలు పల్లాల కృష్ణారెడ్డి , ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యులు బేబీరత్నం, వెంకటలక్ష్మి, గంగవరం మండలానికి చెందిన కొత్తాడ , సూరంపాలెం, సర్పంచ్‌లు కామరాజు దొర, శివదొర, వై.రామవరం మండల సర్పంచ్ సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఢిల్లీ నుంచి మాట్లాడుతూ భారత్ మండపంలోని నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని వై.రామవరం, మారేడుమిల్లి, గంగవరం మండలాలను వెనుకబడిన మండలాలుగా ప్రకటించినట్టు తెలిపారు. గ్రామల్లో రోడ్డు, తాగునీరు, వైద్యం తదితర అభివృద్ధి కార్యక్రమంలను ప్రత్యేక నిధుల మంజూరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయన్నారు. వెనుకబడిన వై.రామవరం తదితర మండలాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు.



ఢిల్లీలోని సమావేశంలో పాల్గొన్న గంగవరం ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం



ఢిల్లీ పర్యటనలో వై.రామవరం మండల ప్రజాప్రతినిధులు

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి (ప్రకాశం జిల్లా)ని నియమించారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 76 మందితో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీని నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర కమిటీలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి జోనల్ ఇన్‌ఛార్జ్ (జోన్-2)గా డాక్టర్ నర్సింగరావు, కార్యదర్శిగా డాక్టర్ నారంజి విజయ్‌కుమార్ నియమితులయ్యారు.

రాజవొమ్మంగిలో భారీ వర్షం

రాజవొమ్మంగి: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. 26.8 ఎంఎం వర్షపాతం నమోదైంది.అప్పలరాజుపేట వద్ద వట్టిగెడ్డ రిజర్వాయర్ పొర్లుకట్టుపై నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. కిమ్మిలిగెడ్డ, ముర్లవానిపాలెం, వయ్యేడు, బూరుగుపల్లి మార్గాల్లో పెద్దేరు, చిన్నేరు, వట్టిగెడ్డ వాగులు ఉధృతంగా ప్రవహించాయి. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. దూసరపాము గ్రామంలో దొడ్ల పార్వతి ఇంటి ప్రహరీ కూలిపోయింది. అప్పలరాజుపేట శివారులో విద్యుత్ మీటర్‌పై పిడుగు పడటంతో మోటార్, వైరింగ్ కాలిపోయింది.

జగనన్న భూహక్కు రైతులకు వరం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: జగనన్న భూ హక్కు పథకం గిరి రైతులక వరమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో గన్నెల, లోతేరు, మాదల, సుంకరమెట్ట, సిర్గం పంచాయతీల పరిధిలోని 10 గ్రామాలకు చెందిన 463 మందికి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములు, గ్రామ కంఠ స్థిరాస్తుల సర్వే నిర్వహించి డిజిటల్ మ్యాపింగ్ ద్వారా లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడం చరిత్రాత్మకమన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో భిషేక్ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ద్వారా ఇస్తున్న పట్టాలతో బ్యాంకు రుణాలు, రైతు భరోసా సాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వ సేవలు ప్రతి ఒక్కరు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీపీ ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీ ఉషారాణి, డుంబ్రిగుడ ఎంపీపీ ఈశ్వరి, సర్పంచ్ బొజ్జ పాల్గొన్నారు.

సివిల్ సర్వీసు పరీక్షలకు ఉచిత శిక్షణ

- 3 నుంచి 7 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : డిగ్రీ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థుల నుంచి పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీస్ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో 50 మంది విద్యార్థులను మూడంచెల విధానంలో ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు. విశాఖపట్నంలోని వేపగుంట యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తొమ్మిది నెలల పాటు అనుభవజ్ఞులైన నిపుణులతో ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఈనెల మూడు నుంచి ఏడో తేదీ వరకు ఐటీడీఏ కార్యాలయం పని వేళల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని నింపి ఈ7 వతేదీ సాయంత్రం నాలుగు గంటల లోగా ఐటీడీఏ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మొదటి దశ స్క్రీనింగ్ పరీక్షలో మొత్తం మార్కుల్లో కనీసం 1/3 వంతు మార్కులు సాధించిన వారు రెండో దశ స్క్రీనింగ్‌కు అర్హులన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు టెన్త్, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు జెరాక్స్ కాపీలతో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు అందజేయాలన్నారు.

తపాలా శాఖ సేవలు మరింత విస్తృతం

ఐపీవో ఉపేంద్ర

అరకులోయ రూరల్: తపాలా శాఖ సేవలు మరింత విస్తృతం చేయాలని అరకులోయ తపాలా శాఖ ఐపీవో అధికారి ఉపేంద్ర తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల తపాలా శాఖ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీపీఎంలకు 20వేలు వ్యయం కలిగిన దర్పన్ సాంకేతిక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ సేవలు మరింత విస్తృతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆధునిక సాంకేతికత విస్తరణకు తపాలాశాఖ కృషి చేస్తోందన్నారు. అరకులోయ తపాలా శాఖ సబ్ డివిజన్‌లోని 75 బ్రాంచిలకు నేటి నుండి దర్పన్ 2.0 స్మార్ట్ సేవలు అందుబాటులోకి వచ్చిందన్నారు. స్థానిక తపాలా శాఖ కార్యాలయం ద్వారా స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, బుకింగ్‌లు, ఈఎంఓలు, ఏఈపీఎస్ సేవలు పొందవచ్చన్నారు. ఐపీపీబీ మేనేజర్ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.



తపాలా శాఖ ఉద్యోగులకు పరికరాలు అందజేస్తున్న ఐపీవో ఉపేంద్ర